# ఎవరికి ఎవరో...

ఆంధ్రభూమి వీక్లీ.. 17 మే, 2001



"నాన్నగారి దగ్గర్నించి ఇంకా ఉత్తరం రాలేదా?"

చలపతి రెండురోజుల్నించి తండ్రి ఉత్తరం కోసం ఎదురుచూస్తున్నాడు. విశేషాలు ఉన్నా, లేకపోయినా క్రమం తప్పకుండా వారానికి ఒక ఉత్తరం రాయడం సుబ్బారావుగారి అలవాటు.

ఉద్యోగరీత్యా చలపతిరావుగారు, అతని భార్య రామలక్ష్మి కలకత్తాలో ఉంటున్నారు. కొత్తగా పెళ్ళయిన యువజంట. స్వేచ్ఛగా ప్రణయ విహారం చేస్తున్నారు. రామలక్ష్మి తల్లిదండ్రులు, చలపతి తల్లిదండ్రులు వాళ్ళ వాళ్ళ స్వస్థలాల్లో ఉంటున్నారు.

వీళ్ళిద్దరూ చలపతి ఉద్యోగ బదిలీల వల్ల దేశమంతా తిరుగుతున్నారు.

రామలక్ష్మి తండ్రి ఇంకా సర్వీసులోనే ఉన్నారు. ఆ ఊళ్లోనే ఉద్యోగం చేస్తున్న కొడుకు, చదువుకుంటున్న ఇంకో కూతురున్నారు. రామలక్ష్మికి తల్లిదండ్రులను గురించిన చింత ఎక్కువ! ఎప్పుడైనా అడపాదడపా గుర్తొచ్చినప్పుడు ఒక ఉత్తరం ముక్క రాసి పడేస్తుంది. ఎంతసేపూ తనూ, తన భర్త- సంసారం ధ్యాస ఆ అమ్మాయికి.

చలపతిరావు సంగతి వేరు. ఎప్పుడూ అతనికి తల్లిదండ్రుల ధ్యాసే! వాళ్ళుండేది కనీస సదుపాయాలు కూడా లేని మారుమూల ప్రదేశం... వేండ్ర గ్రామం. సుబ్బారావుగారు స్కూలుటీచరుగా చేసి రిటైరయ్యారు. పెద్దలిచ్చిన ఆస్తికానీ, ఉద్యోగం చేసి ఆయన సంపాదించి నిలవ చేసుకున్నది కానీ ఏమీ లేదు. జీతం డబ్బులతోనూ, డిపార్టుమెంట్ ఇచ్చే ఋణసదుపాయంతోనూ ఎలాగో అమ్మాయి పెళ్ళి, అబ్బాయి చదువుల బాధ్యతలు నెరవేర్చుకున్నారు. వాళ్ళిద్దరూ స్థిరపడిపోయాక సుబ్బారావుగారు, భార్య సూరమ్మ పెన్షన్ డబ్బులతో ఉన్నఊళ్లోనే కాలక్షేపం చేస్తున్నారు.

ఉద్యోగం వచ్చిన కొత్తలో సుబ్బారావుగారింకా ఉద్యోగం చేస్తూండడంతో- చలపతి ఒంటరిగానే ఒక రూమ్‌లో ఉండేవాడు. ఎప్పుడైనా సెలవు మీద వెళ్ళి తల్లిదండ్రులతో రెండ్రోజులు గడిపి వచ్చేవాడు. చలపతికి చిన్నతనంలో 'హోమ్ సిక్‌నెస్' ఎక్కువగా ఉండేది. తల్లిదండ్రుల్ని వదిలి ఉండాలంటే బెంగపడేవాడు. ముఖ్యంగా అతనికి తల్లి అంటే ఎంతో ప్రేమ.

"అమ్మ... అమ్మ..." అంటూ కూడా తిరిగే చలపతిని చూసి, 'అమ్మకూచి' అని అందరూ ఏడిపిస్తూండేవారు. సాధారణంగా అందరికీ వయసు పెరిగేకొద్దీ అమ్మానాన్నల మీద శ్రద్ధ తగ్గుతూ ఉంటుంది. కానీ, వయసుతోపాటు అతనికి తల్లిదండ్రుల పట్ల ప్రేమ, మమకారం పెరుగుతూ వచ్చాయి. రెండ్రోజులు సెలవు వస్తే చాలు- తన పల్లె 'వేండ్ర' వెళ్ళి తల్లి ఒడిలో వాలిపోవాలని తహతహలాడిపోయేవాడు. దూరప్రయాణం కావటం వల్ల ప్రయాణంలోనే ఎక్కువ సమయం గడిచిపోయి, ఇంట్లో ఉండేకాలం తక్కువగా ఉండేది.

రెండుమూడు సంవత్సరాలు ఉద్యోగం చేసాక- రామలక్ష్మితో చలపతిరావుకి వివాహం జరిగింది. అమ్మానాన్నల అభిప్రాయాన్ని తు.చ. తప్పకుండా శిరసావహించే చలపతి వాళ్ళకి నచ్చిన పిల్లనే చేసుకున్నాడు. రామలక్ష్మి అతనికి చాలా బాగా నచ్చింది.

అయితే... రామలక్ష్మికీ, అతనికీ స్వభావరీత్యా చాలా వ్యత్యాసం ఉంది. ఆమె కాస్త ప్రాక్టికల్ టైపు లేడీ! అతనేమో సెంటిమెంట్ పాలెక్కువైన భావుకుడు!

ఆమె ఎదుట అతనెంతో భావోద్రేకంతో చెప్పే మాటలన్నీ ఆమెకు చాలా స్వల్పవిషయాలుగా తోస్తాయి. మొదట్లో భర్తగారనే గౌరవం వల్ల కాస్త శ్రద్ధగా వినేది. కానీ, పోనుపోనూ పట్టించుకోవడం మానేసింది.

పెళ్ళై కొత్తకాపురం పెట్టిన నెలలోపే వచ్చిన పండుగ సెలవులకి అమ్మానాన్నల దగ్గరికి బయల్దేరాడు చలపతి.

"మొన్ననేగా వచ్చాం... అప్పుడే ఎందుకు? సెలవు కూడా తక్కువ కదా... ఎందుకు లీవ్ వేస్టు చేసుకోవడం?" అంది రామలక్ష్మి.

"అబ్బే... అలా కాదు. అమ్మానాన్న అక్కడ ఒంటరిగా ఉన్నారు. చెల్లాయి కూడా అత్తగారింట్లో ఉంది కదా! మనం వెళితే కాస్త వాళ్ళకి తృప్తిగా ఉంటుంది" అని ఎలాగో ఒప్పించాడు ఆమెను అతను.

'రామలక్ష్మిని ఒప్పించాడు' అనటం కంటే- 'అతణ్ణి నొప్పించలేక ఆమె ఒప్పుకుంది' అనడం సబబు. ఆ పండక్కి వెళ్లివచ్చారు.

సుబ్బారావుగారు బి.పి.తో బాధపడుతున్నారు. సూరమ్మగారి ఆరోగ్యం కూడా ఏమంత బాగాలేదు. రోజురోజుకీ ఏదో ఒక రుగ్మత!

"పోనీ, మాతో వచ్చేయండి నాన్నా... అక్కడే అందరూ కలిసి ఉండొచ్చు!" అన్నాడు చలపతి.

భర్త అనుకోనివిధంగా ప్రపోజ్ చేసేసరికి- బిత్తరపోయింది రామలక్ష్మి. తరువాత "అవునండీ..." అని సన్నగా నవ్వేసి ఊరుకుంది.

అందులో తగిన స్పందన చలపతికి కనిపించలేదు.

"ఎందుకురా? ఆచారిగారి మందులు బాగానే పనిచేస్తున్నాయి. ఏం ఫరవాలేదు. దూరాభారం, భాష కాని భాష... ఆ కలకత్తా మహానగరంలో మేం ఎక్కడ ఉండగలం? మాకల్లా ఈ రామలింగేశ్వరస్వామి, గోపాలస్వామి దేవాలయాలు, ఈ గోస్తనీ నది, ఈ గోదావరి, గోవు పాదాలే సుఖం! సొంత ఇల్లు, ఉన్న ఊరూ వదిలి ఎక్కడికీ రాలేం."

వాళ్ళలా అంటారని రామలక్ష్మి ముందే ఊహించింది.

'కాకపోతే... నిన్నకాక మొన్న పెళ్ళై తేనె వెన్నెలలో హాయిగా గడుపుతున్న తమ మధ్య పానకంతో పుడకలా ఎవరైనా వస్తారా? ఈయన పిలవటం... చెప్పాలి! ఏం మనిషో..?!' అనుకుంది మనసులో.

పెద్దవాళ్ళ పట్ల పెద్ద నిర్లక్ష్య భావమేమీ లేకపోయినా- వాళ్ళు వచ్చి తమతో వుంటే తమ స్వేచ్ఛకు అంతరాయమన్న మోడరన్ థింకింగ్ రామలక్ష్మిది! మనసులో ఎంత దిగులుపడ్డా తల్లిదండ్రుల్ని అక్కడే వదిలి భార్యతో కలకత్తాకు తిరుగుప్రయాణం తప్పలేదు చలపతికి.

కాలం గడుస్తోంది..!

మూడు సంవత్సరాలు ఉద్యోగం చేసిన కలకత్తా మహానగరాన్ని వదిలి, బదిలీ మీద హైదరాబాద్ చేరారు. మోహన్ ఖాళీచేసిన పోర్షన్‌లోనే చలపతి, రామలక్ష్మి చేరారు.

అన్ని వసతులతోనూ ఉన్న మూడు గదుల పోర్షన్! పక్క పోర్షన్‌లోనే ఓనర్లు ఉంటారు. వాళ్ళు ఇద్దరే... భార్య, భర్త! పిల్లలు ఉద్యోగరీత్యా విదేశాలలో స్థిరపడిపోతే వీరిద్దరూ ఇక్కడే ఉండిపోయారు. ఇద్దరూ వయోవృద్ధులు! ఆయన గవర్నమెంట్‌లో మంచి పొజిషన్‌లో ఉండి రిటైరయ్యాడు. "అమ్మాయ్... అమ్మాయ్..." అంటూ ఆవిడ రామలక్ష్మిని ఆప్యాయంగా పలకరిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు పదినిమిషాలు ఆయన కూడా వచ్చి చలపతితో పిచ్చాపాటీ మాట్లాడి వెళుతుంటారు.

ఈ కొత్తస్నేహంలో రామలక్ష్మికి విశేషం కనబడలేదు కాని, చలపతిరావుకి మాత్రం ఆత్మీయత కనిపిస్తోంది. హైదరాబాద్ నుండి వేండ్ర పెద్దదూరం కాకపోయినా- ఇంతవరకూ తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లలేకపోయాడు. మనసులో ఆత్మీయత లోపించి దూరం పెంచుకుంటే అనుబంధ బాంధవ్యాలు దూరదూరంగా ఉండిపోతాయని బాధపడుతుంటాడు.

"ఏమిటి బామ్మగారూ... అదిటివ్వండి... నేను తగిలిస్తాను!" వేంకటేశ్వరస్వామి పటాన్ని గోడకు తగిలించాలని ప్రయాసపడుతున్న ఆమెతో అన్నాడు చలపతి.

"తాతగారేరీ..?" ఫోటో తగిలించి, సరిగా ఆనిందో, లేదో గమనిస్తూ అడిగాడు.

"పార్కుకి వెళ్లారు... వస్తారు. కాఫీ తెమ్మంటావా బాబూ?" ఆవిడ ఆప్యాయంగా అడిగింది.

ఇంట్లో మంచి మోడల్ ఫర్నిచర్, దేనికీ లోటులేదు. మార్బుల్ టేబుల్ మీద ఇద్దరి పిల్లల ఫ్యామిలీ ఫోటోస్- అందంగా లామినేషన్‌తో కలర్‌ఫుల్‌గా ఉన్నాయి.

"వద్దండీ! మీ భాస్కర్, పద్మజల దగ్గర్నించి లెటర్స్ వస్తున్నాయా?" అని అడిగాడు.

"ఆc... నెలకొకటి తప్పనిసరిగా రాస్తారు" ఆవిడ నిర్లిప్తంగా ఫోటోలు చేతిలోకి తీసుకుని, పమిటకొంగుతో ప్రేమగా తుడిచింది.

"తాతగారు రిటైరయ్యాక మీరు వాళ్ళ దగ్గరికి వెళ్లిపోయుండాల్సింది!" అన్నాడు.

ఆవిడ మెల్లగా నవ్వింది.

"ఒకసారి వెళ్లి వచ్చాం. అక్కడ ఇమడలేకపోయాం. అక్కడంతా ఒకటే వేగం! క్షణం ఆగి ఒకరినొకరు పలకరించుకునే తీరిక ఉండదు. కుటుంబంలో భార్య, భర్త, పిల్లలు... అంతా అంతే! ఎవరి ప్రపంచం వారిది. నిమిషం విశ్రాంతి ఉండదు. అదో వింత ప్రపంచం... వచ్చేశాం!"

అవును. 'కర్మభూమి' అనుకునే మనదేశంలోనే మనిషికీ, మనిషికీ మధ్య అంతరాలు అగాధంలా పెరిగిపోతుంటే ఇక భౌతికవాదంలో కూరుకుపోయిన విదేశాల విషయం చెప్పాలా? రెక్కలు వచ్చిన పక్షుల్లా పిల్లలు ఎక్కడెక్కడికో ఎగిరిపోతుంటే... వెంట పరిగెత్తలేని పెద్దవాళ్ళు పుట్టిపెరిగిన గడ్డనే నమ్ముకుని, తమ పాతఛాందసాలతో కాలం గడిపేస్తున్నారు.

వాళ్ళని చూస్తుంటే చలపతికి తన తల్లిదండ్రులు గుర్తుకొస్తారు. వాళ్ళు తమపట్ల చూపిస్తున్న అఫెక్షన్‌లో అతని మనసుకు గొప్ప అనుభూతి లభిస్తోంది.

"ఈసారి పండక్కి తాతగార్ని, మామగార్ని లంచ్‌కి పిలుద్దాం!" అన్నాడు చలపతి.

రామలక్ష్మి అతని వంక అదోలా చూసి, తమాషాగా నవ్వింది. 'ఇతని ప్రపోజల్స్ ఏమిటో వింతగా ఉంటాయి. పక్కవాటాలో వారిని భోజనానికి పిలిచేదేమిటి?' అనుకొని-

"మీరు అనవసరంగా పరిచయాలు పెంచుకుంటారు... తరువాత బాధపడతారు! మనిషి కనబడితే చాలు- వదలరు కదా... ఏదో మొహం వాచిపోయినట్లు!" అంది తన ధోరణిలో.

"పరిచయం కాదు... అది అనుబంధం! నీకర్థం కాదులే! మొహం వాచిపోయినట్లు మనిషి కనబడితే చాలు- వదలనన్నావు కదా!" అతను ఆమె వాడిన మాటకి కాస్త నొచ్చుకున్నాడు.

"నిజంగానే లక్ష్మీ! 'మనిషికి కావాల్సింత డబ్బు, బిల్డింగ్స్, ప్రాపర్టీస్ ఉంటే చాలు' అనుకునే మిథ్యా ప్రపంచంలో నువ్వున్నావు. మమకారం, ఆత్మీయత, తనవాళ్ళ అనురాగం... మనిషికి అంతులేని సిరిసంపదలని నువ్విప్పుడు గ్రహించలేవు. నిజంగానే నేను అమ్మానాన్నల ప్రేమకు మొహంవాచే ఉన్నాను. ఏదో బలీయమైన శక్తి నన్నిక్కడ .వాళ్ళకి దూరంగా కట్టి ఉంచినా- నా మనసు మాత్రం మన వేంద్రలో వాళ్ళ చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది.

లక్ష్మీ..! నా ఈ చిన్నజీవితంలో నేను పోగొట్టుకుంటున్న అనురాగం అపురూపమైనది, అనంతమైనది. అందుకే వాళ్ళ ఆదరణకు నేను మనస్ఫూర్తిగా లొంగిపోయాను. వాళ్ళు కూడా దూరంలో ఉన్న పిల్లల్ని తలచుకుని ఎంతో దిగులు పడుతున్నారు. వాళ్ళు ఇక్కడికి రాలేరు, వీళ్ళు అక్కడికి వెళ్లలేరు. మనం ఇక్కడ వీరిని అదరిస్తే- మనలా అక్కడ మనవారిని మరొకరు ఆదుకుంటారని నా గట్టి నమ్మకం! ఈ ధనప్రపంచంలో మనిషికి మనిషి దూరమైపోతున్నాడు,

డబ్బుకి చేరువవుతున్నాడు. డబ్బు తాగి, డబ్బు తిని, డబ్బునే మనసా, వాచా ఆరాధించి తనలోని 'మనిషితనాన్ని' కోల్పోతున్నాడు. వాళ్ళ ఆప్యాయతలో నేను తల్లిదండ్రుల అనురాగాన్ని అనుభవిస్తున్నాను. వాళ్ళు తమ బిడ్డలతో ఉన్నట్లు ఆనందిస్తున్నారు. ఈ బంధుత్వం నిజం కాకపోవచ్చు, ఈ బంధం శాశ్వతం కాకపోవచ్చు. కానీ, మనిషి తనెక్కడ ఉన్నా- అక్కడ ఈ ప్రేమనీ, ఆదరాన్నీ రంగరించి మమతల కోవెల నిర్మించుకుంటాడు."

– అతడు ఉద్రేకంగా మనసు విప్పి చెప్పుకుపోతున్నాడు.

రామలక్ష్మి వింతగా అతని వంక చూస్తూ అతని మాటల్ని వింటోంది. అతని మనసులోని దిగులు, వేదన ఆమెకు అర్థం అవుతున్నాయి.

సందిస్తే అత్తమామలు తమ మధ్య తిష్ట వేసుకుంటారనీ, తమ స్వేచ్ఛకు భంగం కలుగుతుందనే ఆలోచించింది కానీ- తన అవివేకంతో అమూల్యమైన కుటుంబ సంబంధాల్ని దూరం చేసుకుంటోందా..? 'ఎప్పుడూ చెప్పుల్లో కాళ్లు పెట్టుకువస్తారే కానీ- నాలుగురోజులు సెలవు పెట్టి వస్తే మాకు తృప్తిగా ఉంటుంది' అని దిగాలుగా పలికే అత్తమామలు గుర్తుకువచ్చారు. ఉన్న ఒకటి రెండురోజులు తమపట్ల అపరిమిత అనురాగాన్ని చూపి, ఆ క్షణాలు శాశ్వతంగా గుండెల్లో పదిలపరచుకునే ఆ వృద్ధుల ఆరాటం తను అర్థంచేసుకోకపోగా- 'ఏమిటో ముసలాళ్ళు... అంతా ఛాదస్తం!' అనుకుంటుంది.

తన ధోరణికి మురిపెంగా విసుక్కోకుండా రామలక్ష్మి ఏదో ఆలోచనలో పడడం అతనికి వింతగా అనిపించింది. ఆమె ఏమి ఆలోచిస్తోందో తెలియకపోయినా- బహుశా... రేపు తమ వార్ధక్యపు దశలో తాము కూడా ఇటువంటి భావ సంఘర్షణకు అతీతులం కాదనేమో!

● ● ●

"**మా**మ్మగారూ... రేపు మనింట్లోనే పండుగ చేసుకుందాం! మీరూ, తాతగారూ పొద్దున్నే ఇక్కడికి వచ్చేయాలి!" అని రామలక్ష్మి అనటం అతనికి విస్మయంతోపాటు ఆనందాన్ని కలిగించాయి.

"ఎందుకమ్మా ఇప్పుడు..? నీకు శ్రమ!" అందామె మురిపెంగా.

"అబ్బే శ్రమేమిటి?! మీరు మాకోసం చెయ్యటం లేదా చెప్పండి!" మనస్ఫూర్తిగా అంది రామలక్ష్మి.

"ఈసారి యాన్యువల్ లీవ్ ఓ ఇరవైరోజులు పెట్టండి! అక్కడ... ఇక్కడ సగం సగం గడిపి వద్దాం! పెళ్ళయ్యాక మా ఇంట్లోనూ పట్టుమని పదిరోజులు ఉండలేదు. అమ్మ ఉత్తరాల్లో ఒకటే గోల! నాకూ అందర్నీ చూడాలని ఉంది. అన్నట్లు... తాతగారి చిన్నబ్బాయి నెలరోజుల పాటు ఉండేలా సెలవు మీద వస్తున్నాడట ఫ్యామిలీతో. వాళ్ళకీ దిగులుండదు... మనం లేమని! ఏమంటారు?!"

ఇది పరిష్కారం కాదు. కాని, కొంతలో కొంత తృప్తి! ఉద్యోగ పర్వంలో కుటుంబ సభ్యుల మధ్య ఈ అగాధం అనివార్యమేమో! ఏదిఏమైనా... రామలక్ష్మి తన ధోరణిలోకొచ్చి ఆలోచించి, తన జీవితంతోపాటు తన మమతల కోవెలలో కూడా దేవతగా రూపుదిద్దుకోవడం శుభపరిణామంగా అనిపిస్తోంది చలపతిరావుకి.